సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023



ముగిసిన ఎస్‌పీఎల్ ప్రాంతీయ పోటీలు

బాధ్యతగా కష్టపడితే అనుకున్నది సాధించవచ్చని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు.

- 8లో



మహాశివరాత్రికి పారమ్మకొండపై ఏర్పాట్లు

పాచిపెంట మండలంలోని పారమ్మకొండ వద్ద మహాశివరాత్రి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.

- 8లో



మౌలిక సదుపాయాల కల్పన

జిల్లాల్లో న్యాయస్థానాలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పక్కా భవనాలను నిర్మించడమే లక్ష్యమని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

165 మందికి ప్లేస్‌మెంట్స్

విజయనగరం అర్బన్: పట్టణంలోని ప్రదీప్‌నగర్‌లోని ఎస్‌ఎస్సీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగిన ప్లేస్‌మెంట్ క్యాంపస్‌లో 165 మందికి ఉద్యోగాలు లభించాయి. తొలిత క్యాంపస్ డ్రైవ్‌ను జిల్లా వృత్తి విద్యా అధికారి ఆర్.సురేష్‌కుమార్, ఉమ్మడి జిల్లా ఆర్‌ఐఓ ఎం.సత్యనారాయణ ప్రారంభించారు. క్యాంపస్ డ్రైవ్‌లో హాజరయిన 300 మంది అభ్యర్థులలో 165 మందిని ఎంపిక చేసారని కళాశాల ప్రిన్సిపాల్ పి.ప్రకాష్‌రావు తెలిపారు. డ్రైవ్‌లో పట్టణంలోని పీజీ స్టార్, పీవీఆర్, మెడికల్, సాయి సూపర్ స్పెషాలిటీ, గ్లోబల్, ప్రతాప్, రాధిక మల్టీ స్పెషాలిటీ తదితర 18 యాజమాన్యాలు హాజరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.కమలాదేవి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ ఎస్‌ఎల్ ఎం.కృష్ణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి యశోధనరావు

విజయనగరం ఫూల్‌బాగ్: పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి ఎం.యశోధనరావు అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయనగరం అర్బన్ పరిధిలో ఉన్న వసతిగృహాల పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ, పునఃశ్చరణ తరగతులు సహాయ వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖాధికారి బివి రమణ నేతృత్వంలో స్థానిక కస్పా హైస్కూల్‌లో ఆదివారం జరిగాయి. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు మెలకువలు, పునఃశ్చరణ తరగతులు వివిధ సబ్జెక్టు నిపుణులతో బోధించారు. విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. కార్యక్రమంలో వార్డెన్లు డి.జానకీరావు, జి.చంద్రమౌళి, ఎండ అప్పన్న, జెవి.సన్యాసిరావు, బి.అప్పలకొండ, ఆర్.సత్యనారాయణ, పి.కన్నంనాయుడు, రమణి, డి.జగదాంబ, జి.శ్రీదేవి, కస్పా హెచ్ఎం ఆర్.శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీలకు జిల్లా జట్టు



రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు అర్హత సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్ – 15 బాల, బాలికల చెస్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధమైంది. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తోటపాలెంలోని ఫైర్ చెస్ స్కూల్‌లో నిర్వహించిన ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి అసోసియేషన్ కార్యదర్శి కెవి.జ్వాలాముఖి పర్యవేక్షణలో ఎంపికలు నిర్వహించగా... విద్యార్థులు ప్రత్యర్థులను చిత్తు చేయటంలో ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ ఆకట్టుకున్నారు. ఎంపిక పోటీల్లో బాలుర విభాగంలో కాండ్రేగుల ప్రహ్లాద్, అక్కివరపు పర్వేష్, సత్యసాగర్‌నాయుడు, జలూరు భానుకార్తికేయలు విజేతలుగా నిలవగా.. బాలికల విభాగంలో అక్కివరపు జాస్మిన్, దీక్షశ్రీ, ధనుశ్రీ, కుందన ప్రియలు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎంపికైన 8 మంది క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కెవి.జ్వాలాముఖి తెలిపారు. పోటీలకు చీఫ్ ఆర్బిటర్‌గా సైదాబేగం, డిప్యూటీ ఆర్బిటర్‌గా శ్రీనివాసరావు వ్యవహరించారు.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు

పార్వతీపురం టౌన్: మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు లేదా బాధ్యులైన వాహన యజమానిపై చట్టరీత్యా చర్యలు చేపడతామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో నమోదవుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా మైనర్ల డ్రైవింగ్ వల్లే చోటు చేసుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. మైనర్ల డ్రైవింగ్ మార్గదర్శకాలను విడుదల చేశారు. విద్యార్థులు, మైనర్లు బైక్‌లు, కార్లు నడపడం చట్ట విరుద్ధమని తెలిపారు. 18 సంవత్సరాలు నిండని పిల్లలకు తల్లిదండ్రులు బైకులు, కార్లు ఇవ్వకూడదని సూచించారు. ప్రమాదాల్లో మైనర్లకు గాయాలైనా.. చనిపోయినా ఇందుకు బాధ్యులుగా వాహనం ఇచ్చిన వారిని గుర్తిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

సాఫీగా సాగు సాగేలా...



తుంపర సేద్యం

రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాగు సాఫీగా సాగేలా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రైతు భరోసా వంటి పథకాల సహకారంతో పాటు యంత్రాలు రాయితీపై అందేలా అన్ని విధాలా సహకరిస్తోంది. ఇందులో భాగంగా డ్రిప్, స్ప్రింకర్ల పరికరాల పంపిణీకి రాయితీపై అందుబాటులోకి తెచ్చింది.

- అన్నదాతకు ప్రభుత్వ ప్రోత్సాహం
- రాయితీలపై డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు
- పరికరాల కోసం ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్లు

పార్వతీపురం టౌన్: అన్నదాత సాగు సాఫీగా సాగేలా.. ప్రతి నీటి బొట్టు సద్వినియోగపడేలా ప్రభుత్వం బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా సన్న, చిన్నకారు రైతులకు రాయితీలు అందిస్తోంది. ఆసక్తి గల రైతులు రైతుభరోసా కేంద్రాల్లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఈ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. అర్హులైన రైతులకు సబ్సిడీపై ఈ పరికరాలను అందిస్తోంది. వీటి ద్వారా నీటి వృథాను అరికట్టడంతో పాటు విద్యుత్ పొదుపు, మొక్కకు సరిపడా నీరు అందడం, కూలీల ఖర్చు తగ్గి గణనీయమైన పంట దిగుబడులతో రైతులకు ఈ విధానం లాభదాయకంగా నిలుస్తోంది. ఈ ఏడాది జిల్లాలో 1700 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీఎం ఐపీ) లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు సంబంధించి రైతులు 1600.84 హెకార్లలో సూక్ష్మ పరికరాల ఏర్పాటుకు రైతులు రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నారు.

జిల్లాలో మొదలైన డ్రిప్ పరికరాల పంపిణీ

జిల్లాలోని 15 మండలాల పరిధిలోని గ్రామాలకు సంబంధించి రైతులకు 153.44 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను మంజూరు చేశారు. వాటి ఏర్పాటులో రైతులు, కంపెనీ ప్రతినిధులు బిజీబిజీగా ఉన్నారు. జిల్లాకు సంబంధించి డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు 2022-23 సంవత్సరానికి 15 మండలాల పరిధిలో 1700 హెక్టార్లను లక్ష్యంగా ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాలో రైతులు 1785 హెక్టార్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించి మూడు కంపెనీలు ఒప్పందం కుదుర్చుకుని పరికరాలు రైతులకు అందజేస్తున్నారు.



కొమరాడ మండలంలో ఏర్పాటు చేసిన డ్రిప్ పరికరాలు(ఫైల్)

శరవేగంగా 15 మండలాల్లో రిజిస్ట్రేషన్లు

జిల్లా వ్యాప్తంగా 15 మండలాల పరిధిలోని రైతులు డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఇందుకు తమ పరిధిలో గల ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు మొదలై జోరుగా సాగుతోంది. ఇందులో ఇప్పటి వరకు తమ తమ మండలాలకు ఇచ్చిన లక్ష్యం కంటే అధికంగా డ్రిప్, స్ప్రింక్లర్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కొన్ని మండలాల్లో 100 శాతం పైగా కూడా డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇలా జిల్లాలో కొన్ని మండలాల పరిధిలోని రైతులు వారికి ఇచ్చిన లక్ష్యం కంటే ఎక్కువగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

జిల్లాలో మైక్రో ఇరిగేషన్ వివరాలు

డ్రిప్పు, స్ప్రింక్లర్ ఏర్పాటుకు ఇచ్చిన లక్ష్యం	1700 హెక్టార్లు
రిజిస్ట్రేషన్ పూర్తయిన పొలాలు	1785 హెక్టార్లు
ప్రాథమిక విచారణ పూర్తయిన పొలాలు	900 హెక్టార్లు
పరికరాలు మంజూరైన పొలాలు	368.23 హెక్టార్లు
పరికరాలను అందించిన పొలాలు	153.44 హెక్టార్లు

క్షేత్రస్థాయిలో పరిశీలన

డ్రిప్పు, స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో ముమ్మరంగా పరిశీలన జరుగుతోంది. దరఖాస్తుదారులకు ఎంత భూమి ఉంది, వాటికి బోరు సౌకర్యం ఉందా.. ఉంటే అందులో ఎంత నీరు వస్తుంది.. రైతు పొలంలో ఎన్ని చెట్లు ఉన్నాయి.. పైపుల ఏర్పాటుకు రైతుకు ఎంత ఖర్చవుతుంది.. ఇందులో రైతుకు ఎంత సబ్సిడీ వర్తిస్తుందనే విషయాలను రైతు భరోసా కేంద్ర ఉద్యాన శాఖ లేదా వ్యవసాయ శాఖ అసిస్టెంట్, కంపెనీ ప్రతినిధులు వెళ్లి పరిశీలించి వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ఇందులో ఇప్పటి వరకు సుమారు 480 మంది రైతులకు సంబంధించి 288.34 హెక్టార్లకు సంబంధించి ప్రాథమిక విచారణ కూడా పూర్తి చేశారు. ఇందులో 138 మంది రైతులకు సంబంధించి 178.56 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్లతో మంజూరు చేశారు. వీటిని రైతులు తమ పొలాల్లో వాటిని అమర్చుకుంటున్నారు.

రాయితీ ఇలా...

బిందు, తుంపర సేద్య పరికరాలకు దరఖాస్తు చేసుకునే రైతులకు భూ విస్తీర్ణం మేరకు రాయితీ లభించనుంది. ఇందులో ఐదు ఎకరాలలోపు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ రైతులకు 90 శాతం, 5 నుంచి 12.5 ఎకరాలలోపు ఉన్న రైతులకు 50 శాతం రాయితీపై పరికరాలను ప్రభుత్వం అందిస్తుంది. స్ప్రింక్లర్లకు ఒక ఎకరా నుంచి ఐదెకరాలలోపు రైతులకు 55శాతం రాయితీ అందజేస్తోంది. 5ఎకరాల నుండి 12.5ఎకరాలలోపు రైతులకు 45శాతం స్ప్రింక్లర్లు అందజేస్తున్నారు. గతంలో డ్రిప్ ఏర్పాటు చేసుకుని ఏడు సంవత్సరాలు ముగిసిన రైతులు కూడా డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న రైతులకు డ్రిప్ పరికరాలను పంపిణీ చేసే మూడు కంపెనీల్లో రైతులు దేన్నయినా ఎంపిక చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది.

శరవేగంగా రిజిస్ట్రేషన్లు



డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించిన పరికరాల కోసం రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రస్తుతం జిల్లాలో రిజిస్ట్రేషన్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. రైతు భరోసా ఇన్‌చార్జిలు, కంపెనీ ప్రతినిధుల ద్వారా ప్రాథమిక సర్వే చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న అర్హులైన ప్రతి రైతుకు డ్రిప్, స్ప్రింక్లర్లను మంజూరు చేస్తాం. వీటిని హార్టికల్చర్ అసిస్టెంట్ లేదా అగ్రికల్చర్ అసిస్టెంట్ ద్వారా రైతులకు అందిస్తాం.

– శ్రీనివాసరావు,
జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి,పార్వతీపురం మన్యం జిల్లా

యథావిధిగా 'స్పందన'

పార్వతీపురం: స్పందన కార్యక్రమం ఎప్పటిలాగే కొనసాగిస్తున్నట్లు కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పందన కార్యక్రమానికి అనుగుణంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా జిల్లా అధికారుల, మండల అధికారులు, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది దీన్ని అమలు పరచాలన్నారు. కావున సోమవారం స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ప్రజలు దీన్ని గమనించాలని కోరారు.

టీడీపీని ప్రజలు విశ్వసించరు

- అశోక్ చర్యలు సిగ్గు చేటు
- 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రాష్ట్రంలో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీని, ఆ పార్టీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ పడుకుని దొర్లినా.. పరుగు యాత్రలు చేసినా ప్రజలు వారిని నమ్మరని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు చంద్రబాబు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి విషం చిమ్మేందుకు టీడీపీ ప్రచురించిన పుస్తకాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ప్రజలకు ఏ మేలు చేశారో చెప్పలేక ఇటువంటి కుట్ర రాజకీయాలకు తెర తీస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలను ఓటు అడిగే ధైర్యం, హక్కు కూడా చంద్రబాబుకు లేవన్నారు. రాష్ట్రంలో లంచగొండితనం లేని అవినీతి రహిత పాలన సాగుతుందన్నారు. దేశంలో ఇటువంటి ఘనత సాధించిన ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని కొనియాడారు. పదవీ వ్యామోహంతో ఒత్తిడిలో సైకిల్ పోవాలి..సైకిల్ పాలన వద్దంటూ స్వయంగా తండ్రీకొడుకులైన చంద్రబాబు, లోకేష్ ప్రసంగాలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. చివరకు జడ్జీల ఫోన్లు కూడా ట్యాప్ అవుతున్నట్లుగా ప్రచారాన్ని చేస్తూ న్యాయ వ్యవస్థను కూడా గుప్పెట్లో పెట్టుకునేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో త్వరలో ఇండస్ట్రియల్ సమ్మిట్ జరగనున్న నేపథ్యంలో అనేక పరిశ్రమలు ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు. మారుమూల ప్రాంతంలో అమరావతిని ఏర్పాటు చేసి పరోక్షంగా పరిశ్రమలు రాకుండా చేసిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. రూ.617 కోట్లతో తెలంగాణలో సచివాలయ భవనాన్ని నిరిస్తే.. రూ.900 కోట్లు ఖర్చు పెట్టి అమరావతి అంటూ అతీగతి లేకుండా చేసిన ఘనత చంద్రబాబుదేనని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే గెలుపని అన్నారు.

అశోక్ వ్యాఖ్యలు సిగ్గు చేటు

సుదీర్ఘ కాలం రాష్ట్ర మంత్రిగా, కేంద్ర మంత్రిగా పదవులు అనుభవించిన అశోక్‌గజపతిరాజు ప్రజా అవసరాలను తీర్చే బాధ్యత ప్రభుత్వానిదే అంటూ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. మంత్రిగా ఉన్న ఆయన ప్రజలకు ఏ అవసరాలు తీర్చారో చెప్పాలని అన్నారు. ప్రజల కష్ట సుఖాలను పట్టించుకోని ఆయన ప్రజావసరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఒక సాధారణ పౌరుడిగా భీశెట్టి బాబ్జి క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ధర్నా చేస్తే అక్కడకు అశోక్ వెళ్లి సంఘీభావం తెలపడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మంత్రిగా, శాసనసభ్యుడిగా, కేంద్ర మంత్రిగా ఉన్న ఆయన ఆ సమయంలో అటువంటి ఆస్పత్రి ఏర్పాటుకు ప్రయత్నాలు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. తమ హయాంలో ఆంధ్రా యూనివర్సిటీ విస్తరణ, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభం నుంచి యూనివర్సిటీగా రూపకల్పన చేయటం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేంద్రీయ విద్యాలయం, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసేందుకు కృషి చేశామని కోలగట్ల చెప్పారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: పట్టణంలోని లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర అభినందించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కర్రి వెంకటరావు అధ్యక్షతన పట్టణంలో కేవీఆర్ ఎస్టేట్స్ ఆవరణలో శనివారం రాత్రి నిర్వహించిన లయన్స్‌క్లబ్ గోల్డెన్ జూబ్లీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంగ్లిష్ మీడియంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను లయన్స్‌క్లబ్ అందిస్తోందని, పలు సేవా కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. మంచి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు.

ఆర్ ఎస్ తంగరాజ్ సేవలు అమోఘం

మరో ముఖ్యఅతిథిగా హాజరైన హైకోర్టు న్యాయమూర్తి చీకటి మానవేంద్ర నాథ్ రాయ్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడానికి పలు కార్యక్రమాలు ద్వారా లయన్స్ క్లబ్ కృషి చేయాలని సూచించారు. అమెరికాలో తొలిసారిగా ఈ క్లబ్ ప్రారంభం కాగా, సాలూరులో 1971లో ఆర్‌ఎస్‌తంగరాజ్ ప్రారంభించారని చెబుతూ ఆయన సేవలను గుర్తు చేశారు. ఈ క్లబ్ ద్వారా అందిస్తున్న సేవలను అభినందిస్తూ క్లబ్‌లో సభ్యుల సంఖ్య పెంచాలని, మహిళలకు సేవలందించేందుకు వారికి ప్రత్యేక విభాగం పెట్టాలని సూచించారు. పాఠశాల పూర్వ విద్యార్థి, పశ్చిమగోదావరి ఎస్పీ ఉప్పాడ రవి మాట్లాడుతూ, తాను సాలూరులో చదివానని, ఉన్నతస్థాయికి ఎదగడానికి కృషి చేసిన ఉపాధ్యాయులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ తరువాత ఇక్కడే స్థిరపడతానని పేర్కొన్నారు. ప్రముఖులను నిర్వాహకులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ జడ్జి చక్రపాణి, రిటైర్డ్ జిల్లా జడ్జి ఆదిత్యప్రతాప్ భంజ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

నిరీక్షణ ఫలించిన వేళ

- కేబినెట్ ఆమోదంతో హర్షం
- 1998 డీఎస్సీ అభ్యర్థుల ఆనందహేల
- ఉమ్మడి జిల్లాలో 393 మంది అభ్యర్థులకు ఉద్యోగ అవకాశం



ఆనందం వ్యక్తం చేస్తున్న 1998 డీఎస్సీ అభ్యర్థులు

వీరఘట్టం: పాతికేళ్లుగా ఎదురు చూస్తున్న ఆశల కొలువు తమ దరి చేరబోతోందని 1998 డీఎస్సీ అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమను సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుల్లో నియమించడానికి ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తెలుపుతూ ఫైల్‌పై సంతకం పెట్టడంతో హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.


ఇదీ విషయం..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1998లో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. అభ్యర్థులకు కటాఫ్ మార్కులు నిర్ణయించి రిజర్వేషన్లను కేటాయించింది. అందులో ఓసీలకు 50, బీసీలకు 45, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 40 మార్కులుగా నిర్ణయించారు. ఆ మేరకు అర్హత సాధించిన వారిని ఇంటర్వ్యూలకు పిలిచారు. దీనికి సంబంధించి అప్పట్లో 221 జీఓ జారీ చేశారు. కొన్ని విభాగాల్లో కటాఫ్ మార్కులు సాధించిన అభ్యర్థులు లేకపోవడంతో మరో జీఓ 618ను విడుదల చేసి కటాఫ్ మార్కులను 45, 40, 35గా నిర్ణయించారు. అదే సమయంలో ఏపీలో ఉప ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియ చాలా జిల్లాలో జరగలేదు. ఎన్నికలు పూర్తయిన తర్వాత జిల్లాలో 1:3 నిష్పత్తిలో ఇంటర్వ్యూలకు పిలిచారు. రెండు జీఓల ప్రకారం కూడా అభ్యర్థులు హాజరయ్యారు. మొదటి జీఓ ప్రకారం ఎక్కువ కటాఫ్ మార్కులు వచ్చిన చాలా మంది ఉద్యోగానికి అర్హత సాధించలేకపోయారు. అంతకు ముందు డీఎస్సీల్లో మిగిలిపోయిన వారికి రోస్టర్, సీనియార్టీ ప్రకారం ఖాళీ అయిన పోస్టులను కేటాయించేవారు. ఇక్కడ అలా జరగలేదు. దాంతో వారంతా ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దాదాపు 11 ఏళ్ల పాటు విచారణ జరిపి నష్టపోయిన అభ్యర్థులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని తీర్పు వచ్చింది. 2011లో హైకోర్టులో కూడా విచారణ జరిగాక ట్రిబ్యునల్ తీర్పును హైకోర్టు ధర్మాసనం సమర్థించింది. అయినా వీరికి అప్పటి ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ వీరికి అనుకూలంగా తీర్పు రావడంతో ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వీరికి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు నిర్ణయించింది. గతేడాది జూన్ 14న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 1998 డీఎస్సీ ఉపాధ్యాయుల ఫైల్‌పై సంతకం చేసి వీరికి ఉద్యోగాలు ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇలా నియామకాలు అయిన వారికి మినిమం టైమ్ స్కేల్ క్రింద నెలకు రూ.34 వేలు వేతనం చెల్లిస్తారు.

త్వరలో నియామకాలు

ఉమ్మడి పార్వతీపురం మన్యం జిల్లాలో 493 మంది అర్హత సాధించిన అభ్యర్థులు ఉంటే అందులో ప్రస్తుతం ఉద్యోగం కావాలని 393 మంది ముందుకు వచ్చారు. వీరందరూ ఒప్పంద ప్రాతిపదికన ఉపాధ్యాయులుగా నియమితులు కానున్నారు.

నిబంధనల మేరకు కౌన్సెలింగ్



ఆసక్తి గల అభ్యర్థులంతా ఇప్పటికే దరఖాస్తులు ఇచ్చారు. కమిషనర్ కార్యాలయం నుండి ఆదేశాలు వచ్చిన వెంటనే ఖాళీ పోస్టుల ప్రకటన, సీనియార్టీ జాబితాలు విడుదల, కౌన్సెలింగ్ ప్రక్రియ చేపడతాం.

– ఎస్‌డీవీ రమణ,
డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

సీఎంకు రుణపడి ఉంటాం..



పాతికేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నాం. ఇప్పటికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంతో నేడు మా ఉద్యోగాలు మాకు రానుండడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన రుణం తీర్చుకోలేనిది.

– వారణాసి నరసింగరావు,
1998 డీఎస్సీ అభ్యర్థి, వీరఘట్టం

క్లుప్తంగా

ఎస్ఈబీ కానిస్టేబుల్ ప్రతిభ



సర్టిఫికెట్, మెడల్ అందుకుంటున్న జయరామ్‌నాయుడు

బొబ్బిలి: ఈనెల 10వ తేదీ నుంచి 12వరకు వెస్ట్‌బెంగాల్‌లోని మిడ్నాపూర్‌లో జరిగిన జాతీయస్థాయి 42వ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ –2023లో బొబ్బిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కానిస్టేబుల్ పి.జయరామ్‌నాయుడు ప్రతిభ చాటి ద్వితీయస్థానం సాధించాడు. ఈ చాంపియన్ షిప్ 50ప్లస్ గ్రూప్‌లో 5కిలోమీటర్ల రేస్‌వాకింగ్ విభాగంలో ద్వితీయ స్థానం పొందాడు. జాతీయస్థాయిలో ప్రతిభ చాటిన జయరామ్‌నాయుడుకు పతకం, సర్టిఫికెట్‌ను నిర్వాహకులు అందించారు. తమ కానిస్టేబుల్ జాతీయస్థాయిలో ప్రతిభసాధించడంతో ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్ హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

ఆర్‌టీసీ బస్సును ఢీకొట్టిన లారీ



లారీ ఢీకొట్టడంతో దెబ్బతిన్న బస్సు ముందు భాగం

కొత్తవలస: మండల కేంద్రంలో గల ఏపీఎస్ ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద ఆదివారం తెల్లవారుజామున ఆర్‌టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. వివరాలిలా ఉన్నాయి. మద్దిలపాలెం డిపోకు చెందిన బస్సు కొత్తవలస కాంప్లెక్స్‌లో నైట్ హాల్టు ఉంది. తెల్లవారు జామున మొదటి ట్రిప్‌లో కాంప్లెక్స్‌లోనుంచి బయటకు వస్తున్న సమయంలో విశాఖపట్నం నుంచి ఎస్.కోట వైపు వెళ్తున్న లారీ బలంగా ఢీ కొట్టింది. అయితే అదృష్టవశాత్తు ఆ సమయంలో బస్సులో ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లారీ, బస్సు డ్రైవర్‌లకు ఎటువంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదంలో బస్సు ముందుభాగం పూర్తిగా దెబ్బతింది.

బోల్తాపడిన చెరుకు ట్రాక్టర్



ప్రధాన రహదారిపై బోల్తాపడిన చెరకు ట్రాక్టర్

పాలకొండ రూరల్: పాలకొండ– వీరఘట్టం రహదారిలోని నవగాం సమీపంలో చెరకు తరలిస్తున్న వాహనం అదుపుతప్పి ప్రధాన రహదారిపై ఆదివారం బోల్తాపడింది. ఈ ఘటనలో అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోయినా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది, ముఖ్యంగా జిల్లా కేంద్రానికి, ఒడిశా రాయగడకు వెళ్లే ఈ రహదారిలో వాహనం బోల్తా పడడంతో చెరకు రహదారిపై పడిపోయింది. దీంతో వాహనాల రాకపోకలు కొంతసమయం అంతరాయం కలిగింది.

రాహుల్‌గాంధీ నాయకత్వం బలపరచాలి

- డీసీసీ అధ్యక్షుడు సరగడ రమేష్ కుమార్



కరపత్రాలు పంపిణీచేస్తున్న రమేష్‌కుమార్

నెల్లిమర్ల: రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సరగడ రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి జరజాపుపేటలో హాత్ సే హాత్ జోడో అభియాన్ (చేయి చేయి కలుపుదాం, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం) అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. దేశంలో సమర్థవంతమైన పాలన కోసం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. కార్యక్రమంలో కనకల పద్మనాభం, రామకృష్ణ, అప్పారావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	54,930–00
బంగారం(22కి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹ 190

ముగిసిన ఎస్‌పీఎల్ ప్రాంతీయ పోటీలు



విశాఖ కలెక్టర్ నుంచి ట్రోఫీ స్వీకరిస్తున్న సీనియర్స్ విజేత ఎంవీజీఆర్ కళాశాల



జూనియర్స్ విజేత సాయిగణపతి పాలిటెక్నిక్

- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంవీజీఆర్, ఎస్జీపీ జట్ల అర్హత

విశాఖ స్పోర్ట్స్: బాధ్యతగా కష్టపడితే అనుకున్నది సాధించవచ్చని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. 'సాక్షి' ప్రీమియర్ లీగ్ ప్రాంతీయ పోటీల ముగింపు కార్యక్రమానికి విచ్చేసిన ఆయన క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. చిత్తశుద్ధితో శ్రమిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. క్రికెటర్ భరత్ జిల్లా స్థాయి నుంచి నేడు భారత జట్టుకు ఆడే స్థాయికి ఎదిగాడని ఉదహరించారు. కాగా..'సాక్షి'ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) క్రికెట్ రాష్ట్రస్థాయి పోటీలకు సీనియర్స్ విభాగం నుంచి ఎంవీజీఆర్ కళాశాల(విజయనగరం)జట్టు, జూనియర్స్ విభాగం నుంచి సాయిగణపతి పాలిటెక్నిక్ జట్టు అర్హత సాధించాయి. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో ఆదివారం జరిగిన ప్రాంతీయ స్థాయి పోటీల ఫైనల్‌లో ప్రభుత్వ మెన్ ఆర్ట్స్ కళాశాల(శ్రీకాకుళం) జట్టుపై తొమ్మిది వికెట్ల తేడాతో ఎంవీజీఆర్ కళాశాల(విజయనగరం) జట్టు, సాయిగణపతి పాలిటెక్నిక్(గిడిజాల) జట్టు 16 పరుగుల తేడాతో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల(పెద్దాపురం) జట్టుపై విజయం సాధించాయి. 'సాక్షి'మీడియా ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, విశాఖ ఉమ్మడి జిల్లాల విజేతలుగా నిలిచిన సీనియర్స్, జూనియర్స్ జట్లు పోటీపడ్డాయి. ముగింపు కార్యక్రమంలో 'సాక్షి'బ్యూరో చీఫ్ కె.జి. రాఘవేంద్రరెడ్డి, యాడ్స్ డీజీఎం శ్రీనివాసరావు, బ్రాంచ్ మేనేజర్ చంద్రరావు, 'సాక్షి' టీవీ సీనియర్ కరస్పాండెంట్ రామచంద్రరావు పాల్గొన్నారు. ప్రాంతీయ పోటీల్లో విజేతలకు కలెక్టర్ ట్రోఫీలు, సర్టిఫికెట్లు బహూకరించారు.

బెంబేలెత్తించిన బౌలర్లు..

సీనియర్స్ విభాగంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ ఓడిన ప్రభుత్వ మెన్ ఆర్ట్స్ కళాశాల(శ్రీకాకుళం) జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 10 ఓవర్లకు మరో రెండు బంతులుండగానే 59 పరుగులకు ఆలౌటైంది. జయంత్ మూడు, కల్యాణ్ రెండు, సురేష్ ఒక వికెట్ తీసి బ్యాటర్లను బెంబేలెత్తించారు. ప్రతిగా ఎంవీజీఆర్ కళాశాల జట్టు (విజయనగరం) ఒకే వికెట్ కోల్పోయి 7.1 ఓవర్లలోనే విజయ లక్ష్యాన్నందుకుంది. కిరీటీ 24 పరుగులు చేశాడు. యశ్వంత్ ఒక వికెట్ తీయగలిగాడు.

ఆల్‌రౌండ్ ప్రతిభ..

జూనియర్స్ విభాగంలో టాస్ గెలిచిన శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల జట్టు లక్ష్య ఛేదనకే మొగ్గు చూపింది. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన సాయిగణపతి పాలిటెక్నిక్ జట్టు 10 ఓవర్లకు ఎనిమిది వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసింది. నూకేష్ 29, కుమార్ 22 పరుగులు చేశారు. యశస్వి, చారి రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా శ్రీ ప్రకాష్ జట్టు మూడే వికెట్లు కోల్పోయినా.. 68 పరుగులే చేసింది. చరణ్ సాయి 35 పరుగులతో రాణించాడు.



సీనియర్స్ రన్నరప్ శ్రీకాకుళం ప్రభుత్వ ఆర్ట్స్‌కళాశాల



జూనియర్స్ రన్నరప్ శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల

కోర్టులకు మౌలిక సదుపాయాల కల్పన



మానవేంద్రనాథ్ రాయ్‌ను సత్కరిస్తున్న న్యాయమూర్తులు

- హైకోర్టు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్



సత్కారసభలో మాట్లాడుతున్న జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్



జస్టిస్ సురేష్‌రెడ్డిని సత్కరిస్తున్న న్యాయవాదులు

విజయనగరం లీగల్: జిల్లాల్లో న్యాయస్థానాలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పక్కా భవనాలను నిర్మించడమే లక్ష్యమని రాష్ట్ర హైకోర్టు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లా కేంద్రంలో నూతన కోర్టు భవన నిర్మాణానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా కేంద్రానికి ఆదివారం వచ్చిన జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ కె.సురేష్‌రెడ్డిలను స్థానిక న్యాయవాదుల సంఘం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ రాయ్ మాట్లాడుతూ కేవలం 30 ఏళ్లకే జిల్లా కోర్టు కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరుకోవడం శోచనీయమంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రూ.112 కోట్లతో నూతన భవనం నిర్మించడానికి అనుమతులు లభించాయన్నారు. అయితే నిధులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు చేయించుకోవాల్సిన బాధ్యత స్థానిక నేతలు, న్యాయవాదులపై ఉందన్నారు. జిల్లా పోర్టు పోలియో జడ్జి జస్టిస్ సురేష్‌రెడ్డి చొరవ, న్యాయవాదుల కృషితోనే నూతన భవనం నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్‌తో పాటు కోర్టును తాత్కాలిక భవనానికి తరలించేందుకు అనుమతి లభించిందన్నారు. జిల్లా కేంద్రంలో అదనపు సబార్డినేట్ కోర్టు ఏర్పాటుకు ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం పొందడం వెనుక మంత్రి బొత్స సత్యనారాయణ, న్యాయవాదుల సంఘం సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. నూతన భవనాన్ని అన్ని హంగులతో నిర్మించాల్సిన బాధ్యత తీసుకోవాలని సూచించారు.

జిల్లా జడ్జి కృషి అభినందనీయం

ఈ సత్కార సభకు విశిష్ట అతిథిగా విచ్చేసిన జిల్లా పోర్టు పోలియో జడ్జి కె.సురేష్ రెడ్డి మాట్లాడుతూ తన సహచర న్యాయమూర్తి జస్టిస్ రాయ్ సమక్షంలో స్థానిక న్యాయవాదులు తనను కూడా సత్కరించడం ఆనందదాయకమన్నారు. జిల్లా కేంద్రంలో నూతన కోర్టు భవన నిర్మాణానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కల్యాణ్ చక్రవర్తి చొరవ అభినందనీయమని ప్రశంసించారు. ఎప్పటికప్పుడు కోర్టు భవనం పరిస్థితిపై హైకోర్టుకు నివేదిక అందించడంతో త్వరితగతిన గ్రీన్‌సిగ్నల్ లభించిందని చెప్పారు. న్యాయవాదులు కూడా పలుమార్లు హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో పాటు బిల్డింగ్ కమిటీ సభ్యులను కలవడం వల్ల మంజూరు సులభతరమైందన్నారు. అనంతరం కార్యక్రమంలో జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ సురేష్ రెడ్డిల దంపతులను జిల్లా న్యాయవాదుల సంఘం సముచిత రీతిలో సత్కరించింది. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కల్యాణ చక్రవర్తి, ఇతర న్యాయమూర్తులు కె.రాధారత్నం, షేక్ సికింద్ర బాషా, ఎం.మీనా, న్యాయవాదుల సంఘం ప్రతినిధులు బి.సంజీవ రావు, చుక్క బాలభాస్కరరావు, యు.వి.రాజేష్, చింతాడ రాజేష్, కోన అప్పారావు నాయుడు, రాష్ట్ర బార్ కౌన్సిల్ మాజీ వైస్‌చైర్మన్ కోలగట్ల తమ్మన్నశెట్టి తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో బాలికల జట్టు సత్తా



ప్రథమస్థానం సాధించిన విజేతలకు షీల్డ్ అందిస్తున్న నిర్వాహకులు

రాజాం సిటీ: షూటింగ్ బాల్ పోటీల్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా బాలికల జట్టు రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. కృష్ణాజిల్లా బాపులపాడులో ఈ నెల 10 నుంచి 12 వరకు మూడు రోజులపాటు జరిగిన పోటీల్లో బాలికలు సత్తా చాటారని ఏపీ షూటింగ్‌బాల్ అసోసియేషన్ వైస్‌చైర్మన్ పాలవలస శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఫైనల్‌లో నెల్లూరు జట్టుపై శ్రీకాకుళం జట్టు పైచేయి సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. జిల్లా జట్టు సభ్యుల్లో వంగర మండలం మద్దువలస, సంతకవిటి మండలం మండాకురిటి, సంతకవిటి, రేగిడి మండలం కందిశ, రేగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు టెక్కలి మహాత్మాజ్యోతిబా పూలే పాఠశాల విద్యార్థినులు ఉన్నారు.ఈ జట్టులో ఎక్కువగా రాజాం నియోజక వర్గానికి చెందిన విద్యార్థినులే ఉన్నారు. ఈ సందర్భంగా బాలికల విజయంపట్ల జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గోవిందనాయుడుతోపాటు పలువురు అభినందించారు.

మహాశివరాత్రికి పారమ్మ కొండపై ఏర్పాట్లు



కొండపైకి తరలిస్తున్న వాటర్‌ప్యాకెట్ల బస్తాలు

సాలూరు: పాచిపెంట మండలంలోని పారమ్మకొండ వద్ద మహాశివరాత్రి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా కొండమీదకు తాగు నీటిని అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.మార్గమధ్యంలో భక్తులకు వాటర్‌ప్యాకెట్లు ద్వారా నీటిని అందించనున్నట్లు ఈఓ ప్రసాదరావు తెలిపారు.వేలాది సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

చైతన్య ప్రతీకలు నాటికలు

- రెండోరోజు ఆకట్టుకున్న ప్రదర్శనలు



నాన్నా నేనొచ్చేస్తా..నాటికలో సన్నివేశం

విజయనగరం టౌన్: నాటికలు చైతన్య ప్రతీకలని ప్రముఖ సాహితీవేత్త నాలుగెస్సుల రాజు పేర్కొన్నారు. నాటకశాల, అభినయ సంస్థ సంయుక్త నిర్వహణలో నటరత్న నాటక పరిషత్ నిర్వహిస్తున్న 7వ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలలో భాగంగా రెండోరోజు గురజాడ కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన పోటీలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్న మంచి చెడులను కళ్లకు కట్టినట్టు చూపించే నాటికలు నేడు కనుమరుగయ్యాయన్నారు. పాశ్చాత్య పోకడలు విజృంభిస్తున్న నేటితరుణంలో ఇటువంటి సంస్థలు తమ నటనా ప్రదర్శనలతో సమాజానికి మంచి మెసెజ్ ఇవ్వడం ఎంతైనా అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు నడిపేన శ్రీనివాసరావు (జమ్ము శ్రీను), సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు అభినయ శ్రీనివాస్, గెద్ద వరప్రసాద్, సభ్యులు ఎంఎస్ఆర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన నాటికలు

పల్నాడు జిల్లా, చిలకలూరి పేట అంజనా రాథోడ్ థియేటర్ ఆర్ఎస్ఆర్.నాయక్ దర్శకత్వంలో 'నాన్నా నేనొచ్చేస్తా'..నాటిక ఆద్యంతం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. తాళా బత్తుల వెంకటేశ్వరరావు రచనలో ఇతివృత్తం అద్భుతంగా కట్టిపడేసింది. సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువు నుంచి పెళ్లి వకూ అడిగిందల్లా కాదనకుండా ఇస్తారు. మితిమీరిన వాత్సల్యం, మమకారాన్ని పెంచుకుని, పోనీలే మన పిల్లలేగా అని స్వేచ్ఛనిచ్చి పెంచితే దాని ఫలితం, పెళ్లైన కొంతకాలానికేవైవాహిక జీవితంలో భార్యా,భర్తల మధ్య వచ్చిన మనస్పర్థలను పరిష్కరించుకోలేకపోతున్నారు. పెళ్లంటే సర్దుబాటు, సంసారం అంటే దిద్దుబాటు అన్న సూత్రాన్ని అర్థం చేసుకోలేక మెట్టినింటి నుంచి పుట్టినింటికి 'నాన్నా... నేనొచ్చేస్తా..' అంటూ ప్రయాణం చేస్తున్న సుధ లాంటి అమ్మాయికి, భర్త శ్రీరామ్‌కి, తల్లిదండ్రులు రాఘవ, సావిత్రిల మధ్య జరిగిన సంఘర్షణలకు దృశ్యరూపమే ఈ నాటిక సారాంశం, అనంతరం గుంటూరు శ్రీ సద్గురు కళా నిలయం ఆధ్వర్యంలో బసవరాజ్ జయశంకర్ దర్శకత్వంలో విద్యాధర్ మునిపల్లె రచనలో నిర్వహించిన 'కమనీయం' నాటిక ఆద్యంతం ఆకట్టుకుంది. జాతీయ వారసత్వ సంపద మన కళలు, మన చరిత్రకు ప్రత్యక్ష సాక్ష్యాధారాలు. కళాభిమానాన్ని భావితరాలకు అందించండని, ఏదైనా ఒక కళారూపాన్ని నేర్పించేందుకు ప్రోత్సహించడని, కళలను బతికించడం మన బాధ్యతని తెలియజేయడమే 'కమనీయం' నాటిక సారాంశం.

ఇద్దరు చైన్ స్నాచర్స్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ లక్ష్మణరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: ఓ మహిళ ఆటో దిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా స్కూటీపై వచ్చిన ఇద్దరు దుండుగులు ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కుని పరారైన కేసులో టూటౌన్ పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖకు చెందిన నల్లపురాజు పద్మావతి దేవి జనవరి 15న పూల్‌బాగ్‌లో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లేందుకు అయ్యప్పనగర్ జంక్షన్‌లో ఆటోదిగి నడుచుకుంటూ వెళ్తోంది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు ఆమె మెడలో ఉన్న నాలుగున్నర తులాల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. ఈ మేరకు ఆమె టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు లంకవీధి జంక్షన్ వద్ద ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్ వెనక్కి తిప్పి పారిపోతున్న విశాఖకు చెందిన బొండా అరుణకుమార్, కనగంటి డానియల్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నిందితులు నేరం అంగీకరించారు. నిందితుల నుంచి మోటార్ సైకిల్‌ను సీజ్ చేశారు. బంగారాన్ని కరిగించి విశాఖ అట్టికా గోల్డ్‌షాప్‌లో అమ్మినట్లు నిందితులు అంగీకరించడంతో ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన ఏఎస్సై, పైడితల్లి, టీమ్‌ను సీఐ అభినందించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



మృతిచెందిన గణేష్

శృంగవరపుకోట: ఇటీవల పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన పట్టణానికి చెందిన యువకుడు వారాది గణేష్(28) విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. స్థానిక గొల్లవీధిలో నివాసం ఉంటున్న గణేష్ మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో కుటుంబాన్ని వదిలేస్తున్నావని భార్య నాగమణి మందలించడంతో మనస్తాపం చెంది ఈనెల 10వ తేదీన పురుగు మందు తాగాడు. దీంతో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు ఎస్.కోట ఎస్సై తారకేశ్వరరావు చెప్పారు.

గిరిజనుడికి రూ.25వేల సాయం



గిరిజనుడికి రూ.25వేలు ఇస్తున్న ధ్యానం నాన్న బిడ్డలు

శృంగవరపుకోట: చనిపోయిన భార్య మృతదేహాన్ని తన భుజంపై మోసుకెళ్లిన గిరిజనుడి పరిస్థితికి తల్లడిల్లిన ఎస్.కోట రాజీపేట గ్రామంలో గల శంబల నగరి నిర్వాహకులు ఆదివారం రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. రాజీపేట నుంచి మౌనయాత్రి తపస్వి ధ్యానం నాన్న బిడ్డలు మురళి, కిశోర్, సత్తిబాబు, అప్పారావులు 125కి.మీ దూరంలో ఉన్న ఒడిశా రాష్ట్రంలోని కొరాపుట్ జిల్లా మిర్తిపాడు సమితిలో పొట్టంగి గ్రామానికి వెళ్లి గిరిజనుడు సోములుకు రూ.25వేలు అందజేశారు. ఒడిశాకు చెందిన ఈడ సోములు తన భార్య సాములుకు ఆరోగ్యం బాగులేకపోవడంతో విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చాడు. ఆమె పరిస్థితి విషమించడంతో ఇంటికి తీసుకుపొమ్మని వైద్యులు చెప్పారు. దీంతో భార్యను ఆటోలో తీసుకుని విజయనగరం వెళ్తుండగా మార్గమధ్యంలో ఆమె మరణించడంతో ఆటో డ్రైవర్ అర్థాంతరంగా వదిలి వెళ్లిపోయాడు. అనంతరం దిక్కుతోచని స్థితిలో భార్య మృతదేహాన్ని భుజాన వేసుకుని నడుస్తున్న సోములును చూసిన విజయనగరం ఎస్సై తిరుపతిరావు అంబులెన్స్ ఏర్పాటు చేసి ఇంటికి పంపారు. ఈ ఘటనతో కలత చెందిన శంబలనగరి ఆశ్రమ వ్యవస్థాపకులు ధ్యానం నాన్న తన బిడ్డలతో గిరిజనకుటుంబానికి ఆర్థిక సాయం పంపించారు.

రెండు పూరిళ్లు దగ్ధం



దగ్ధమైన పూరిళ్లను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పాచిపెంట: మండలంలోని మోసూరు గ్రామంలో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించి రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యామల పోలినాయుడు పూరింటిలో శనివారం రాత్రి అకస్మికంగా మంటలు వ్యాపించాయి. మంటలు అదుపుచేసేలోపు పక్కన ఉన్న కట్టపల్లి సుశీలకు చెందిన పూరింటికి కూడా అంటుకోవడంతో రెండిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి, ఈ ప్రమాదంలో సుమారు రూ.40 వేల ఆస్తినష్టం జరిగినట్లు ప్రమాద స్థలాన్ని సందర్శించిన రెవెన్యూ అధికారులు అంచనా వేశారు.

విద్యార్థికి గాయాలు

సీతానగరం: మండలంలోని జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయం విద్యార్థి శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో వసతిగృహంలో పడిపోవడంతో గాయాల పాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయంలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న ఎస్.సుమన శనివారం రాత్రి డార్మిటరీలో మొబైల్ ఫోన్ చూసుకుంటూ నడవడం వల్ల ప్రమాదవశాత్తు కింద పడడడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గల కారణాలపై ప్రిన్సిపాల్ పి వెంకటనాయుడు దగ్గర ప్రస్తావించగా డార్మిటరీ వద్ద గాయాలపాలైన విద్యార్థిని సిబ్బంది సహకారంతో చికిత్స నిమిత్తం 108 లో పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని చెప్పారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం మహరాజా ఆస్పత్రికి రిఫర్ చేశారని తెలియజేశారు. విద్యార్థి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు వచ్చి దగ్గరుండి చూసుకుంటున్నారని తెలియజేశారు.